www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 26 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య

నాయీ బ్రాహ్మణులకు భృతి పెంపు శుభపరిణామం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని 6ఎ ఆలయాల కేశఖండన శాలల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు కనీస వేతన కమిషన్ రూ.20 నుంచి రూ.25 వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం శుభపరిణామమని టిడిపి రాష్ట్ర నాయీబ్రాహ్మణ సాధికార సమితి నాయకులు మంగళ ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కొనియాడారు. ఆలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారి కమిషన్ రూ.25 వేలకు పెంచడం సిఎం చంద్రబాబు నాయుడి విజ్ఞతకు నిదర్శనమన్నారు. నాయీ బ్రాహ్మణ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబులకి నాయి బ్రాహ్మణుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు రామకృష్ణ, మనోహర్, మంజునాథ్, ఈశ్వర్, నారప్ప పాండు, నాగరాజు, పాండు, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-పెద్దమండ్యం

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. మొదట మండల కేంద్రంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్‌ను వేర్వేరు చేయకుండా ఉండడంపై ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, డిఎల్‌పిఒ నాగరాజుల పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో పారిశుధ్య కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని, రోడ్ల పక్కన పేర్కొన్న చెత్తాచెదారాలను తొలగించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పచ్చదనం పారిశుధ్యం అమలుతో ఆర్థిక అభివృద్ధికి మూలం అవుతుందని ప్రభుత్వం బృందావనం పేరుతో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. వీటి నిర్వహణను సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో పారిశుద్ధ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. రోజు ఎంత చెత్త వస్తుంది, ఏ విధంగా కలెక్ట్ చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు చెత్త సేకరణ జరగాలన్నారు. తడి పొడి చెత్తలను, ప్లాస్టిక్ తప్పనిసరిగా వేరు చేయాలని తెలిపారు. పారిశుధ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, రహదారుల పక్కన పేరుకున్న చెత్తలను తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూచించారు. అనంతరం మండలంలో తాగునీటి సమస్యపై సమీక్షించారు. మండలంలో ఎన్ని ఒహెచ్‌ఎస్‌ఆర్‌లు ఉన్నాయి, ఎప్పుడు శుభ్రం చేశారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎక్కడైనా తాగునీటి ఇబ్బంది ఉందా, నీటి రవాణా చేయాల్సిన గ్రామాలు ఏవైనా ఉన్నాయా అని తెలుసుకున్నారు. ప్రస్తుతానికి ఎక్కడ రవాణా చేయడం లేదని, రెండు మూడు వారాల తర్వాత పరిస్థితిని బట్టి నీటి రవాణా చేయాల్సిన అవసరం రావచ్చని అధికారులు వివరించారు. ఎక్కడ కూడా తాగునీటికి ఇబ్బంది రాకూడదని తెలిపారు. ఏఏ ప్రాంతాల్లో ఏఏ గ్రామాలకు నీటి రవాణా చేయాల్సి వస్తుందో ముందుగానే గుర్తించి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల నీటితొట్ల నిర్మాణాలను కూడా త్వరగా పూర్తి చేయాలని డ్వామా ఎపిడికి సూచించారు. మండలంలో గ్రీన్ ఫాడర్ పెంపకానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలన్నారు. ఇందుకు భూములను త్వరగా గుర్తించాలని తాసిల్దారును ఆదేశించారు. వ్యవసాయ ఉద్యాన పంటలు ఎంత విస్తీర్ణంలో సాగుతున్నాయి, ఏఏ పంటలు పండుతున్నాయన్న వివరాలను వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 785 ఎకరాలలో మామిడి, 553 ఎకరాలలో టమోటా పంట సాగుతున్నట్లు ఉద్యాన శాఖ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. పంట దిగుబడి తగ్గకుండా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు తగిన అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మండలంలో గృహ నిర్మాణ ప్రగతి పై సమీక్షించిచారు. ప్రభుత్వం అందించిన అదనపు ఆర్థిక సహాయంతో తుది దశలో ఉన్న ఇండ్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏ సిబ్బంది ఉన్నారు, సిబ్బంది హాజరు పట్టిక, ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి ఎలాంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయని కలెక్టర్ అడుగగా ప్రస్తుతం వడ, జ్వరం, దగ్గు లాంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయని వైద్య సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు వైద్య సిబ్బంది అందరూ కృషి చేయాలని తెలిపారు. ప్రజలకు వైద్య సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలన్నారు. వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఏవైనా మందుల కొరత ఉంటే వెంటనే ప్రతిపాదనలు సమర్పించి మందులు స్టాక్ ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్య కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.షాహిద్ అహ్మద్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీధర్‌రావు, పిహెచ్‌సి వైద్యాధికారి ఇమ్మానుయేల్, వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులపై నిరసన జ్వాలలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పర్యాటక కేంద్రమైన పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రవాదం, మతోన్మాదం నశించి ప్రపంచశాంతి వర్ధిల్లాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లా పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులను వెంటనే శిక్షించాలని, ఈ చర్య చాలా హేయమైనదని, అనాగరిమని పేర్కొంటూ శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసిస్తూ, అమరులైన వారికి జోహార్లు అర్పిస్తూ కొవ్వొత్తులతో రాజంపేట ప్రభుత్వ కళాశాల మైదానంలో శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ దుశ్చర్యను పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఖండించారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు సైనిక బలాన్ని ప్రతి ఏడాది నియామకాల ద్వారా పెంచుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటన పునరావృతం కాకుండా దేశ సరిహద్దులను కట్టుదిట్టం చేయాలన్నారు. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, విద్యార్థులను డాక్టర్లు, ఇంజినీర్లుగా కాక ప్రభుత్వంలోని అన్ని రంగాలతో పాటు సైనిక రంగంలో కూడా తమ ప్రాతినిధ్యం ఉండేటట్లుగా ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. మతతత్వం కంటే మానవత్వం గొప్పదని, మన స్వార్థాన్ని వీడి దేశ రక్షణ కోసం, దేశ సమైక్యతను కాపాడడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రమణయ్య, గోపాల కృష్ణ, శివయ్య, శివకుమార్, విశ్వనాథ్, కిషోర్, రవి చంద్ర ప్రసాద్, నాగరాజు, నరసింహా రావు, వెంకట రమణ, నరేష్, యోగానందం, సుబ్బారావు, పెన్షనర్లు శశిధర్, వెంకటేశ్వర రెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు. **మదనపల్లె :** పాకిస్థాన్‌ను ఉగ్రవాద దేశంగా ఐక్యరాజ్య సమితి ప్రక టించాలని డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు అన్నారు. స్థానిక శుభం ఫంక్షన్ హల్‌లో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రజాక్, చిత్తూరు, కడప ఆఫీస్ క్లార్క్‌లు, మదనపల్లి డివిజన్ మాజీ సైనికులు ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికులు వీరనారిమానులు డాకుమెంట్స్ సమ స్యలు తీర్చారన్నారు. కార్యక్రమంలో పీలేరు ప్రెసిడెంట్ రెడ్డప్పరెడ్డి, పుంగనూరు వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీ నారాయణ, సెక్రటరీ రాయుడు వెంకటస్వామి ప్రతాప్‌రెడ్డి వెంకటరమణారెడ్డి, దిలీప్ కమిటీ మెంబెర్స్ మాజీ సైనికులుపాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** కాశ్మీర్ పర్యాటక కేంద్రం పహ్లగాం పర్యా టకులపై జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ, ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ కొవ్వొత్తులతో హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో శుక్రవారం సభ్యులు నివాళులర్పించారు. ఈ సందరేగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదంతో దేశానికి ప్రమాదకరమన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందిస్తే ఇటువంటి సమ స్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూ బకర్ సిద్దిక్, వాలంటరీ బ్లడ్ బ్యాంక్ అధికారి బాల చంద్ర నాయుడు, సంస్థ సభ్యులు దినకర్, చైతు, కిరణ్, రష్మిక సాంబ, చరణ్, నవీన్, నరేష్ పాల్గొన్నారు.

రాజంపేట: కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ప్రజలు

మదనపల్లె : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

రాయచోటి: పర్యాటకులపై జరిగిన దారుణ హత్యాకాండకు నిరసనగా రాయచోటి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9.30 గంటలకు పాత కోర్టు వద్ద జరగబోయే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బార్‌అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డిబాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతి న్యాయవాది నల్లకోట్లు ధరించి కచ్చితంగా హాజరు కావాలని, న్యాయవాద గుమస్తాలు, ప్రజా సంఘాలు, ప్రజా స్వామ్య వాదులు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జైలులో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

సబ్ జైలులో జడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారం కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల మేరకు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనికీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చున్నారు. కార్యక్రమంలో రాయచోటి అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎన్.తేజస్విని, రాయచోటి సబ్ జైలు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది రమణ, ఖైదీలు పాల్గొన్నారు.

ఘనంగా 'వెలుగు' 27వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదర్ థెరిస్సా ఆశయాలకు అనుగుణంగా వెలుగు సంస్థ సేవలు నిర్వహిస్తున్నట్లు 27వ వార్షికోత్సవంలో ఆ సంస్థ నిర్వాహకులు ఉదయ మోహన్ రెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు తెలిపారు. శుక్రవారం వెలుగు ప్రాంగణంలో నిర్వహించిన సంస్థ 27వ వార్షికోత్సవ వేడుకలకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిశోర్, అమృత హాస్పిటల్స్ అధినేత గోపి కృష్ణ, శ్రీకృష్ణ గ్రూప్స్ అధినేత శశిధర్ రావు, వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ అనిల్, ఆర్ఒ శ్రీకాంత్, దర్శిని స్పెషల్ స్కూల్ గోవింద రెడ్డి, వెలుగు ప్రెసిడెంట్ రమణరావు, వెలుగు సూపరింటెండెంట్ ఎం.ఉదయ్ కుమార్‌రెడ్డి, ట్రెజరర్ రఘునాథ్‌రెడ్డి, సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, సభ్యులు సుజాత, ప్రిన్సిపల్ లీనా కుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంస్థ వ్యవస్థాపకులు స్వర్గీయ పద్మజ చిత్రపటానికి పూజ నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ నిర్వహించిన మూకీ డ్రామా పోటీలలో దేశ వ్యాప్తంగా ఉత్తీర్ణత సాధించిన చిన్నారులకు కృష్ణ కిశోర్, ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి సర్టిఫికెట్లు, బ్యాడ్జులు, మెడల్స్ అందజేశారు. అమృత హాస్పిటల్స్ గోపికృష్ణ మాట్లాడుతూ కీర్తిశేషులు పద్మజ ఎంతో దృఢ సంకల్పంతో వెలుగు సంస్థను ప్రారంభించారని, అది ఈనాడు 27 సంవత్సరాలుగా ఎనలేని సేవలను దివ్యాంగులకు, వృద్ధులకు అందిస్తోందన్నారు. ఇలాంటి వార్షికోత్సవాలు మరెన్నో పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ గొప్పయజ్ఞాన్ని ముందుకు తీసుకువెళ్తున్న ఉదయ్ మోహన్‌రెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులకు అభినందలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు యోగ విన్యాసాలతో అలరించారు. వెలుగు సంస్థతో మంచి అనుబంధం ఉన్న విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.వి.కృష్ణ కిషోరుని శాలువాతో సత్కరించి, మొమెంటోను అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, వృద్ధులు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్‌సి వర్గీకరణ

మాట్లాడుతున్న సువర్ణరాజు

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

30 సంవత్సరాల పాటు సుధీర్ఘ పోరాటాలు చేయడం వల్లనే ఎస్‌సి వర్గీకరణ సాధ్యమైందని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు అన్నారు. శుక్రవారం ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బోనమల ఖాదరవల్లి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్, హిందుస్థాని అవమ్ మోర్చా పార్టీ జనరల్ సెక్రెటరీ రఫీక్‌తో కలిసి సువర్ణరాజు ఎంఆర్‌పిఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. వారికి సంబేపల్లి మండల ఎంఆర్‌పిఎస్ నాయకులు సి.వి.రమణ ఆధ్వర్యంలో డప్పులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లా డుతూ మాదిగలో విద్య, ఉద్యోగం, రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో సమానత్వం కోసం 30 ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసి మన జాతి అభ్యున్నతి కోసం దండోరా ఉద్యమం చేసి సుమారు 15 మంది పైగా ప్రాణ త్యాగాలు చేసి అహర్నిశలు రాత్రింబవళ్లు శ్రమించి ఉద్యమించి జాతి కోసం ఎన్నో త్యాగాలు సాధించిన త్యాగఫలమే ఎస్‌సి వర్గీకరణ అని పేర్కొన్నారు. 30 సంవత్సరాలు నుండి జాతి కోసం చేసిన పోరాటాలు ఒక లెక్క ఇప్పటినుండి మనం చేసే పోరాటాలు ఒక లెక్క కావాలని మన జాతి బిడ్డల అభివృద్ధి కోసం నియోజకవర్గంలో మనమందరం కలిసి అడుగు అడుగు కలిపి మన ఆశయాల లక్ష్యసాధన కోసం మన హక్కుల కోసం పోరాడి మన జాతి బిడ్డల సమస్యల పరిష్కారం దిశగా మనందరం కలిసి పని చేయాలని పేర్కొన్నారు. అండగా మేము ఉంటామని సంబేపల్లి మండలంలోని నాయకులకు కార్యకర్తలకు భరోసా కల్పించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుల కోసం మనం పోరాటంచేయాలని, మనజాతి అభ్యున్నతి కోసం పాటుపడాలని ఆశయంతో మండుటి ఎండను సైతం లెక్క చేయకుండా ఇక్కడ నిలబడి ఉన్న ప్రతి ఒక్క ఎంఆర్‌పిఎస్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డి సురేష్, రాష్ట్ర కార్యదర్శి గురు శంకర్ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు, యువజన అధ్యక్షులు పెద్దపల్లి అశోక్‌కుమార్, తిరుపతి దాము, దేవర ఇంటి సురేష్, ప్రవీణ్ కుమార్, సుబ్రహ్మణ్యం, వెంకటేస్, వెంకటరమణ, బాబు, ఎంపిటిసి రామ రాజు, సాయి, పీలేరు గురు, పురుషోత్తం, అమృతపురి శ్రీనివాసులు, వీరేంద్ర కుమార్, బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- డిఆర్ఒ మధుసూదన్ రావు

ప్రజాశక్తి-రాయచోటి

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష 2025 ఈ నెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ మధుసూదన్ రావు తెలిపారు. పరీక్ష ఏర్పాట్లపై డిఆర్ఒ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మధుసూధన్ రావు మాట్లాడుతూ ఎపి పాలిసెట్ 2025 పరీక్షను 30వ తేదీన అందరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద శానిటైజేషన్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తహశీల్దార్లు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్టు డిపార్ట్మెంట్స్ వారిని బస్సులు ఏర్పాటు చేయాలని, గ్రామీణ విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూడాలని తెలిపారు. హెల్త్ డిపార్ట్మెంట్ వారు పరీక్ష కేంద్రాల వద్ద హెల్త్ టీమ్ ఏర్పాటు చేసి, ఎండ వేడిమికి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన వెంటనే వైద్యం అందించాలని సూచించారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు, పరీక్ష కేంద్రాలకు నిరంతర విద్యుత్ ప్రసారం చేయాలని సూచించారు. 30వ తేదీన పరీక్ష కేంద్రాలను పరిశీలించాలని తహశీల్దార్లుకు తెలిపారు. ప్రవేశ పరీక్షలను సజీవుగా జరపడానికి అందరు కృషి చేయాలని కోరారు. ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని తెలిపారు. సమావేశానికి రెవెన్యూ, పోలీస్, ఎడ్యుకేషన్, హెల్త్, ఎలక్ట్రిసిటీ, ట్రాన్స్‌ఫోర్ట్, లేబర్, మున్సిపాలిటీ మొదలగు డిపార్ట్‌మెంట్ల అధికారులు, రాయచోటి, రాజంపేట, మదనపల్లి, కలికిరిలకు చెందిన తహశీల్దర్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. సమీక్ష సమావేశంలో రాయచోటి, రాజంపేట, మదనపల్లి, కళికిరి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ మధుసూదన్‌రావు

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : డిసి

మాట్లాడుతున్న ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజ్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాను నాటు సారా రహితంగా జిల్లాలు చేసేందుకు అందరం కలిసి పనిచేయాలని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిధిలో ఉండే అన్ని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా నవోదయం 2.0 ప్రధాన లక్ష్యమైన నాటుసారా రహిత జిల్లాగా అన్నమయ్య జిల్లాను మార్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాల మీద చర్చించినట్లు తెలిపారు. ప్రధానంగా నాటుసారా ప్రభావిత ప్రాంతాలు గల స్టేషన్లు వాయల్పాడు, మదనపల్లి, మొలకలచెరువు, పీలరులలో ఎటువంటి చర్యలద్వార నాటుసార రహితంగా మార్చేందుకు తగు సూచనలు ఇచ్చారు. నాటుసారా ప్రభావిత ప్రాంతాలలో పాత నేరస్థ పై నిఘా ఉంచాలని తెలిపారు. వారిని బైండ్ ఓవర్ చేయడం వంటి అంశాలకు సంబంధించి సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నాటుసారా తయారు చేసే ప్రాంతాలను గుర్తెందుకు డ్రోన్ సాంకేతకతను వినియోగించు కోవాలిన్నారు. తదుపరి స్టేషన్ వారి పనితీరును కూడా సమీక్షించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి మధుసూదన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను సత్కరిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

కార్మికుల సేవలు మరువలేనివి : కమిషనర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. పారిశుధ్య విభాగంలో పనిచేసి బాధ్యత విరమణ పొందిన పారిశుధ్య కార్మికులు సీతమ్మ, విజయలక్ష్మి, కొండయ్యలను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శి, సిబ్బంది సహకారంతో ఘనంగా సన్మానించారు. శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎవరికైనా ఉద్యోగ విరమణ తప్పదని, పురపాలక పరిధిలో పారిశుధ్య విభాగంలో విశేష సేవలు అందించిన ఈ ముగ్గురూ శేష జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, మున్సిపల్ యూనియన్ నాయకులు పి.వి.రమణ, లక్ష్మీదేవి, ఎం.వి.రమణ, కె.ప్రసాద్, కారిక్మకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల మంజూరులో లబ్ధిదారులకు అన్యాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చేతి వృత్తుల వారికి ఆర్థికంగా సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టిందని టిడిపి మైనార్టీ నాయకులు, తెలుగు యువత రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు మహబూబ్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె మండల పరిధిలో చాలామంది అర్హులు ఈ రుణాలకు దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. మదనపల్లి ఎంపిడిఒ పూర్తయిన దరఖాస్తులను బ్యాంకులకు చేరవేయకుండా తీవ్ర జాప్యం చేస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. తమకు అనుకూలమైన వారికి వత్తాసు పలుకుతూ ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. కార్పొరేషన్ రుణాలు అంటే కేవలం పేదవారికి మాత్రమే వర్తించాలన్నారు. పలుకుబడి కలిగిన వారికి ప్రాధాన్యత నివ్వడం బాధాకరమన్నారు. ఈ విషయంపై లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బాబులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎంపిడిఒ అర్హత ఉన్న లబ్ధిదారులకు కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని, లేని యెడల ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకండి

- ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు లక్ష్మీరాజా

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చవద్దని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్.వి ఇంజినీరింగ్ కళాశాలలో 'విద్యార్థులు-మార్కుల యంత్రాలు-విలువలు' అనే అంశం మీద ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.లక్ష్మీరాజా అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకురాలిపై ఓ విద్యార్థి చెప్పుతో దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రుల పైన, సమాజం పైన ఉపాధ్యాయ, అధ్యాపకుల పైన ఉందని తెలిపారు. విద్యార్థులను మార్కుల యంత్రాలుగా చూడటం, తయారు చేయటం వల్ల ఈ సమాజానికి, ఈ దేశానికి ఉపయోగం ఉండదన్నారు. సమాజ మార్పు కోసం, జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకుని సమ సమాజం నిర్మించుటలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం తల్లిదండ్రుల తర్వాత గురువు నిరంతరం శ్రమిస్తాడు అన్నది నగ్న సత్యమన్నారు. విద్యార్థుల బోధనాంశాలలో నీతి కథలు, మారల్ పీరియడ్స్ లాంగ్వేజ్ లలో విద్యార్థుల నిజ జీవితానికి అవసరమైన పాఠ్యాంశాలు లేకపోవడం ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఒక లోపంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఎపిటిఎఫ్1938 జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.కృష్ణారెడ్డి, ఎపిటిఎఫ్257 నాయకులు నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు అన్ని స్థాయిలలో సదస్సులు నిర్వహించి వారిలో సామాజిక చైతన్యాన్ని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి

అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి షేక్ మస్తాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో అంశంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆ సమయంలో అగ్నిని ఆర్పే పరికరాలను ఎలా ఉపయోగించాలో వాటి ద్వారా ప్రయోగాత్మకంగా వారికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, ముందస్తు జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వై.పవన్‌కుమార్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ షేక్‌మస్తాన్, ఫైర్ సిబ్బంది నాగిరెడ్డి, వెంకటరమణ, చైతన్య, ఆసుపత్రి వైద్యులు, నర్సులు సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కలికిరి

అనురాగ్ రెడ్డి, చరణ్‌జిత్

నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు శాంతి నికేతన్ నవోదయ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ ప్రతాప్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ శివకుమార్ తెలిపారు. 2025-26 నవోదయ విద్యా సంవత్సరానికి గాను శాంతినికేతన్ కోచింగ్ సెంటర్ నుంచి 20 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు హాజరుకాగా వారిలో అనురాగ్ రెడ్డి 97.5 మార్కులు, వెంకట్ గణేష్ 86.25 మార్కులు, మహేంద్ర నాయుడు 83.75, పంచ జన్యరెడ్డి 83.75, సాయి రిషిక 78.75, రిధాన్ 78.75, ధార్మిక్ సృజన్78.75, హర్షిత్ 75, 9వ తరగతి విద్యార్థి చరణ్ జిత్ 74, నిఖిల ప్రియ 73.75, తెజెస్ 72.50 మార్కులు సాధించారు. వీరిలో అనురాగ్‌రెడ్డి, చరణ్‌జిత్ ఇద్దరు విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాంతిని కేతన్ కరస్పాండెంట్ ఎం.ప్రతాప్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ శివకుమార్, అధ్యాపక బృందం వారిని ప్రత్యేకంగా అభినందించారు.

87 మందికి కొత్త పింఛన్లు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - రామసముద్రం

ప్రభుత్వం వితంతువులకు శుభవార్త చెప్పిందని ఎంపిడిఒ భానుప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2023 డిసెంబర్ నుంచి 2024 అక్టోబర్ మధ్య పింఛన్ పొందుతూ చనిపోయిన భర్తల స్థానంలో వారి భార్యలకు కొత్తగా పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మండల వ్యాప్తంగా దాదాపు 87 మందికి మే ఒకటవ తేది నుంచి పింఛన్ పొందగలుగుతారని తెలిపారు. వీరంతా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన మహిళలు తమ గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏప్రిల్ 30 లోపు అవసరమైన వివరాలు, పత్రాలు సమర్పిస్తే, మే 1 నుంచి పింఛన్ అందుకోవడం మొదలవుతుందని తెలిపారు. ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, భర్తకుసంబంధించి మరణ ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వంటివి సచివాలయానికి తీసుకెళ్లాలని తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పిటిఎంరోడ్డులోని కార్యాలయంలో సిపిఐ తంబళ్లపల్లె నియోజకవర్గపు కార్యవర్గ సమావేశం ఆ పార్టీ ములకలచెరువు మండల కార్యదర్శి కె.అంజనప్ప అధ్యక్షతన జరిగింది. తొలుత జమ్మూ కాశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఐదు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

కాంతులతో నిండిన కలకడ బస్టాండ్

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కలకడ : మండల కేంద్రమైన కలకడ ఆర్‌టిసి బస్టాండు విద్యుత్ కాంతులతో విరాజిల్లింది. ఈనెల 23న ప్రజాశక్తి దినపత్రికలో ‘ కారు చీకట్లో కలకడ బస్టాండ్’ అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన పీలేరు డిపో మేనేజర్ నిర్మల బస్టాండ్ ఆవరణంలో రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలిగేటట్లు చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో నైట్ అవుట్ చేస్తున్న మదనపల్లి డిపోలకు చెందిన బస్సు డ్రైవర్, కండక్టర్లు బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు నిద్రావస్థకు ఆటంకం కలుగుతున్న తరుణంలో విద్యుత్ దీపాలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. ఇకపై అలా జరగకుండా బస్టాండ్ ఆవరణంలో రాత్రి వేళల్లో విద్యుత్ బల్బులు వెలిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బస్టాండ్ ఆవరణంలో వెలుగుతున్న విద్యుత్ దీపాలు

‘ఉపాధి’ పనుల్లో అవకతవకలు

- రూ.20 లక్షల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి ముద్దా వెంకటసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని వత్తలూరు ఉపాధి హామీ పనుల్లో అంతా అవినీతి జరుగుతోందని ఎంపిపి ముద్దా వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిపి అధ్యక్షతన ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులపై మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో మొత్తం 22 పంచాయితీలుగాను 3290 మంది ఉపాధి హామీ కూలీలు ఉండగా, ఒక్క వత్తలూరు పంచాయతీలోనే వెయ్యి మంది ఉపాధి కూలీలు ఉన్నారని, ఇక అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోందని అన్నారు. తిప్పాయపల్లెలో ఒక క్రిమినల్‌ని పెట్టుకొని అతను కోర్టుకు హాజరైన రోజు కూడా పనికి వేతనం చెల్లించడం దారుణమని పేర్కొన్నారు. కోర్టుకు హాజరైన వ్యక్తికి ఆరోజు వేతనం చెల్లించలేదని నిరూపిస్తే నా ఆస్తిలో 50 శాతం రాసిస్తానని సవాల్ విసిరారు. ఉపాధి పనిలో లక్షలాది రూపాయలు దోచుకోమని మీకు సిఎం చంద్రబాబు చెప్పారా, స్థానిక ఎమ్మెల్యే చెప్పారా అంటూ ఎపిఒను నిలదీశారు. అనంత సముద్రము, వత్తలూరు పంచాయతీలలో ఒకే ఫోటో పెట్టి వివిధ రకాల పేర్లతో నమోదు చేశారని ఆరోపించారు. పుల్లంపేట పంచాయతీకి చెందిన వ్యక్తికి రామసముద్రం పంచాయతీలో పనిలో పెట్టి 28 వేల రూపాయలు అతను తీసుకున్నాడని, మూరముట్లపల్లె వారి ఫోటో పెట్టి ఈడిగ పల్లె లోని ముస్లింలు, కల్లు గీత కార్మికుల వారి పేర్లు నమోదు చేశారని అన్నారు. మళ్ళెంవారిపల్లె వారి ఫోటో పెట్టి తిరుమలయ్యగారిపల్లె వారి పేర్లు నమోదు చేశారని అన్నారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు, మహిళలను కూడా ఉపాధి హామీ కూలీలుగా నమోదు చేయించి సుమారు రూ.20లక్షలు స్వాహా చేస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లేనప్పుడు సంబంధిత పంచాయతీ సర్పంచ్ అనుమతి లేకుండానే తమకు నచ్చిన వారిని మేట్లుగా నియమించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఐదేళ్ల క్రితమే ఈ విషయాన్ని ఎన్నో మార్లు ఎపిఒ దృష్టికి తీసుకొచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. ఎపిఒ శ్రీనివాసులు

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వెంకటసుబ్బారెడ్డి

మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నందున వారిని గుర్తు పెట్టుకోవడం కష్టమని అందువల్ల పొరపాటు జరిగి ఉంటుందని అన్నారు. కానీ ఒక 20 రోజులు గడువు ఇస్తున్నానని ఈ 20 రోజుల్లో పుల్లంపేటలో మొత్తం ఉపాధి హామీ ప్రక్షాళన చేయాలని, అర్హులైన కూలీలకు న్యాయం జరగాలని తెలిపారు. గత తొమ్మిది నెలల వ్యవధిలో మూడుసార్లు సర్వసభ్య సమావేశాలు నిర్వహించినా తహశీల్దార్ హాజరు కాకపోవడం పట్ల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆలస్యంగా తహశీల్దార్ సమావేశానికి హాజరయ్యారు. అనంతసముద్రంలో వంద సంవత్సరాల చింత చెట్టును పెట్రోల్ పోసి కాల్చివేసిన వారిని చర్యలు తీసుకోలేదని అన్నారు. స్పందించిన తహశీల్దార్ వారం రోజుల్లో గా రైతు సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. మండలంలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు వెలిశాయని అన్నారు. మద్యం మత్తులో మండలంలో 38 మంది చెందగా పుల్లంపేటలోనే 12 మంది మృతి చెందారని పేర్కొన్నారు. బెల్ట్‌షాపులను తొలగించకపోతే ఈనెల మే 15న వెయ్యి మంది మహిళలతో రాజంపేట ఎక్సైజ్ సిఐ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి చక్రధర్‌రాజు మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో పుల్లంపేట, కొత్తపేట, దలవాయిపల్లి, రెడ్డిపల్లి, దాసరిపల్లి, అనంతంపల్లి, ఈడిగపల్లి గ్రామాలలో ప్రభుత్వం 2025-2026 విద్యాసంవత్సరం నుంచి మోడల్ స్కూల్ ప్రవేశపెట్టిందని విద్యార్థులు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జయశంకర్ నాయుడు, బోగా వెంకటరత్నమ్మ, ఎంపిడిఒ వరప్రసాద్, తహశీల్దార్ అరవిందకిషోర్, మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి :‘ముక్కా’

సిసిరోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, రూపానందరెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో రూ.60లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ అభివృద్ధే తమ లక్ష్యమని అన్నారు. ప్రతి గ్రామంలో రోడ్డు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, ప్రతి కుటుంబానికి మంచి జరిగేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలు మాట్లాడుతూ గత పదేళ్లుగా తమ గ్రామంలో రోడ్డు చాలా అధ్వానంగా ఉందని, వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నామని అన్నారు. గత ప్రభుత్వంలో అనేకమంది అధికారులు, ప్రజా ప్రతినిధులకు తమ సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోలేదని అన్నారు. రూపానందరెడ్డి చొరవతో సిమెంటు రోడ్డు ఏర్పాటు కావడంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పసుపులేటి వెంకటరమణ, టిడిపి మండల అధ్యక్షులు ఆరే సుధాకర్‌నాయుడు, మండల ఉపాధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, కూటమి నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం : డిప్యూటీ డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-మదనపల్లె

మలేరియా అంతం మనతోనే సాధ్యమని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని త్యాగరాజావీధి లోని యుపిహెచ్‌సిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖలీలున్నాఖాన్ సిబ్బంది చేత నినాదాలు చేయిస్తూ ర్యాలీ నిర్వహించి, అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మలేరియా జ్వరం ఆడ అనాఫిలస్ దోమకాటు ద్వారా వ్యాపిస్తుందని, మంచినీటిలో పెరిగి మలేరియా వ్యాధిని వ్యాపింపజేస్తుందని అన్నారు. చలిజ్వరం, తలనొప్పి, ఒళ్ళునొప్పులు, తీవ్రంగా వణకడము, కండరాల బలహీనత, ఛాతిలో నొప్పిగా ఉండడము, దగ్గు, చెమటలు, వాంతులు విరేచనాలు, నీరసం, ఆయాసం లాంటి లక్షణాలతో బాధపడు తారని, గర్భిణులు, చిన్నపిల్లలు ఈ వ్యాధి తీవ్రతకు ఎక్కువగా గురవుతారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అనుపమ, డాక్టర్ జిలాని, డిఇఒ భాస్కర్, యుపిహెచ్‌సి, సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండల కేంద్రమైన నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు సూచనలతో, మెడికల్ ఆఫీసర్-2 డాక్టర్ ప్రత్యూష నిర్వహించారు. సమాజంలో మలేరియా వ్యాధి భారాన్ని తగ్గించడానికి ‘జీవితాలను రక్షించు ఆవిష్కర ణలకు నడుంబిగించు’ అనే అజెండాతో వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించడానికి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఇంద్రావతి, పిహెచ్‌ఎన్ సరోజ, హెల్త్ సూపర్వైజర్లు దేవేంద్ర, దేవ కుమారి, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** దోమలను లార్వాదశలోనే అరికట్టాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ సానే శేఖర్ తెలిపారు. రాజంపేట సబ్ యూనిట్ పరిధిలోని ఈడిగపాలెం యుపిహెచ్‌సిలో మలేరియాపై అవగాహన సదస్సు మరియు ర్యాలీ నిర్వహించారు. బానలు, డ్రమ్ములు, టైర్లు శుభ్రం చేసుకోవాలని, నీరు నిలువ వున్న చోట అబేట్ ద్రావణంతో పిచికారి చేయడం ద్వారా లార్వా దశలోనే నియంత్రించి మలేరియాను అరికట్టవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు శరత్, అశోక్, స్నేహలత, రాజశేఖర్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్. ఎస్.దాస్, టిబి సూపర్‌వైజర్ జయప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** సమాజంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియాఅరికట్టవచ్చని పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సానేశేఖర్, మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, సిహెచ్ఒ రాజా, పిహెచ్‌ఎన్ ఆరోహరమ్మ, పురుష ఆరోగ్య

పీలేరు :మలేరియా వ్యతిరేక ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య బృందం

కార్యకర్తలు, మహిళ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు:** మలేరియా నిర్మూలనా చర్యలు మరింత వేగవంతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని తలుపుల, రేగళ్ళు పి.హెచ్.సిల ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీని ఉద్దేశించి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, సబ్ యూనిట్ అధికారి విద్యా సాగర్ మాట్లాడుతూ జ్వరం ఏదైనా మలేరియా పరీక్షలు తప్పనిసరని, వ్యాధి నిర్ధారణ తర్వాత తగు చికిత్స పొందడం చాలా మంచిదని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ జయలక్ష్మి, సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, యంపిహెచ్ఇఒ శ్రీనివాసులు, సూపర్ వైజర్లు మోహన్, కుసుమ, పవన్ కుమార్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **రాయచోటి :** పట్టణంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధి కారి డాక్టర్ ఉషశ్రీ ఆదేశాలమేరకు ఏరియా ఆస్పత్రి నుంచి బంగ్లా సర్కిల్ వరకూ ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఆర్. రామచంద్ర రెడ్డి పర్యవేక్షణలో , రాయచోటి సభ్యునిటీ అధికారి ఎన్. జయ రామయ్య, రిజర్వు సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ 2027 నాటికి జీరో మలేరియాను 2030 నాటికి మలేరియా నిర్మూలనను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్లు కిరణ్ కుమార్, శివ, డాక్టర్ రామ్ రాజ్, రాయచోటి రిజర్వు సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, సభ్యునిటీ ఆఫీసర్ ఎన్. జయరామయ్య. హెల్త్ ఎడ్యుకేటర్ బలరాం రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు :** మలేరియా మనమే అంతం చేయాలి అని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శేఖర్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా రాజంపేట సబ్ యూనిట్ పరిధిలో స్థానిక పిహెచ్‌సిలో మలేరియా పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ దాస్, టిబి సూపర్‌వైజర్ జయ ప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ ఎంలు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని మండలంలోని చింతపర్తి వైద్యాధికారి జులేఖబేగం అన్నారు. మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. మలేరియాను ధీటుగా ఎదుర్కొందాం అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్ర మంలో డాక్టర్ సనా అయేష, సిబ్బంది కిరణ్‌బాబు, ఇందిర, ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.

IN THE COURT OF THE (spl woman)
MOTOR ACIDENTS CLAIMS TRIBUNAL,
PRI.DISTRICT JUDGE
AT: KHAMMAM
MATOP NO 282/2024

Between:
Bhukya srinu ......Cllaim Petitioner
AND
Ch. Siva shankar and others .... Respondents

To
Respondents no 2
2.Shaik Nawaz Ali, s/o. Sk. Khadar valli, age:34 years , Occ: Owner of lorry bearing No. AP 02 TE-3677, R/0 H.no 12-207, Ahartha street, Madhanapalli (v&m)Annamaiah. District. A. P.
3. Cholmandalam MS Gen, Insurance Co.Ltd rep.by its branch manager, Nellore. .... Respondents

NOTICE

Take Notice that the above named claim petitioner have filed the above O.P. against the respondents claiming compensation. the above case is stands posted to 05-05-2025 for your appearance.Therefore, you are here by directed to appear before the Hon'ble court on 05-05-2025 at about 10.30 A.M in person or through an advocate without fail. Filing which the matter will be decided ex-parte against you.

//By order of the court //
BHUKYA HARI Advocate,
Khammam, Telangana.
cell:9177674552

IN THE COURT OF THE (spl woman)
MOTOR ACIDENTS CLAIMS TRIBUNAL,
PRI.DISTRICT JUDGE
AT: KHAMMAM
MATOP NO 285/2024

Between:
Guguloth veeru ...... Cllaim Petitioner
AND
Ch. Siva shankar and others ..... Respondents

To
Respondents no 2
2.Shaik Nawaz Ali, s/o. Sk. Khadar valli, age:34 years , Occ: Owner of lorry bearing No. AP 02 TE-3677, R/0 H.no 12-207, Ahartha street, Madhanapalli (v&m)Annamaiah. District. A. P.
3. Cholmandalam MS Gen, Insurance Co.Ltd rep.by its branch manager, Nellore ..... Respondents

NOTICE

Take Notice that the above named claim petitioner have filed the above O.P. against the respondents claiming compensation. the above case is stands posted to 05-05-2025 for your appearance.Therefore, you are here by directed to appear before the Hon'ble court on 05-05-2025 at about 10.30 A.M in person or through an advocate without fail. Filing which the matter will be decided ex-parte against you.

//By order of the court //
BHUKYA HARI Advocate,
Khammam,Telangana.
cell:9177674552

మహారాజశ్రీ రాజంపేట జూనియరు సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 55/2024

దొడ్డిపల్లి వసుమావతి. ...వాది

Vs

ఎమిక రవికిరణ్ తండ్రి లేట్ సుబ్బరామయ్య వయస్సు 27 సం॥, డోర్ నెం. 5/83, M. గొల్లపల్లి గ్రామం, మైలపల్లి పోస్ట్, చిట్వేల్ మండలం, అన్నమయ్య జిల్లా.
...ప్రతివాది నెం.2

సమను

పై కనిన వాది, పైకనిన ప్రతివాది మరియు ఇంకా కొంత మంది మీద 1/3 వ భాగపరిష్కారము కోరుతూ పై కోర్టులో O.S.No.55/2024 దావాను దాఖలు చేసియున్నారు. ఇందులకు గాను మీకు ఎలాంటి ఆక్షేపణలున్న యెడల 16.05.2025 తేదిన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని హాజరై మనవి చేసుకోనవలెయును. లేనియెడల మీకు పరోక్షంగా తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియచేయడమైనది.

//By Order of the Court//
K.రవిశంకర్,
D.నాగేంద్ర బాబు
అడ్వకేట్స్,
రాజంపేట.

మహారాజశ్రీ రాజంపేట జూనియరు సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A No. 184/2024
O.S.No. 55/2024

దొడ్డిపల్లి వసుమావతి. ...పిటిషనరు

Vs

ఎమిక రవికిరణ్ తండ్రి లేట్ సుబ్బరామయ్య వయస్సు 27 సం॥, డోర్ నెం. 5/83, M. గొల్లపల్లి గ్రామం, మైలపల్లి పోస్ట్, చిట్వేల్ మండలం, అన్నమయ్య జిల్లా.
...రెస్పాండెంట్ నెం. 2

సమను

పై కనిన పిటిషనరు, పైకనిన రెస్పాండెంట్ మరియు ఇంకా కొంత మంది మీద ఇంజెక్షన్ కోరుతూ పై కోర్టులో O.S.No. 55/2024 లో I.A No. 184/2024 పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. ఇందులకు గాను మీకు ఎలాంటి ఆక్షేపణలున్న యెడల 16.05.2025 తేదిన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని హాజరై మనవి చేసుకోనవలెయును. లేనియెడల మీకు పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

//By Order of the Court//
K.రవిశంకర్,
D.నాగేంద్ర బాబు
అడ్వకేట్స్, రాజంపేట.

లబ్దిదారులతో మాట్లాడుతున్న పీడీ సాంబశివయ్య

పక్కా గృహాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రామాపురం

పక్కా గృహాల కోసం అర్హులైన వారు గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి బిసి కాలనీ కుమ్మరపల్లి గ్రామాలలో శుక్రవారం ఆయన నిర్మాణదశలో ఉన్న పక్కా గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కుమ్మరపల్లె గ్రామంలో పూరి ల్లు నివాసమున్న వారు కనిపించడంతో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అర్హులైన వారు సచివాలయంలో ఆన్ లైన్‌లో పక్కా గృహాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో మంజూరైన గృహాల్లో నిర్మించు కోలేకపోయినా ఎస్‌టి లబ్ధిదారులకు రూ.70వేలు, ఎస్‌సి, బిసి లబ్ధిదారులకు 50వేలు చొప్పున అదనంగా ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. ఆయన వెంట మండల హౌసింగ్ ఎఇ ఎల్‌వి.ప్రసాద్, సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

విశిష్ట వేరుశనగను చూపుతున్న కెవికె కో-ఆర్టినేటర్ మంజుల, రైతు

విశిష్ట వేరుశనగ రకంతో అధిక దిగుబడి

-కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

విశిష్ట వేరుశనగ రకం తోనే రైతులకు అధిక దిగుబడులు లభిస్తాయని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో నూతన వేరుశెనగ రకం విశిష్ట నుంచి సంతృప్తికర దిగుబడిని రైతులు సాధించినట్లు ఆమె తెలిపారు. జిల్లాలో వేరుశనగ, వరి ప్రధానమైన పంటలని, సాధారణంగా రైతులు నారాయణి, కె-6 అనే వేరుశనగ రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారని అన్నారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వారు 2022 లో విడుదల చేసిన విశిష్ట రకాన్ని, కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి వారు ప్రస్తుత రబీ కాలంలో రైతుల పొలాల్లో సామూహిక ప్రదర్శనా క్షేత్రాలు వాయల్పాడు, పిలేరు, కలికిరి, కెవి పల్లి మండలాల్లో నిర్వహించడం జరిగిందని తెలిపారు.వశిష్ట రకం టిక్కా ఆకు మచ్చ, తుప్పు తెగుళ్లను తట్టుకుంటుందని, ఈ రకం నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటుందని అన్నారు. పంట కాలం రబీలో 105-110 రోజులు పసుతుందని, ఒక ఎకరాకు రబీలో సమగ్ర యాజమాన్యం పద్ధతులు పాటిస్తే 35 నుంచి 40 బస్తాలు దిగుబడినిస్తుందని, నూనె శాతం 50శాతం ఉంటుందని అన్నారు. గండబోయన పల్లి గ్రామం, వాయల్పాడు మండలం లోని పి సత్య నారాయణ రెడ్డి అనే రైతు నారాయణి, కదిరి లేపాక్షి, విశిష్ట అనే వేరుశనగ రకాలను ఒకే పొలం దగ్గర 2 ఎకరాలు డ్రిప్ ద్వారా సాగు చేసారని విశిష్ట వేరుశనగ రకం ఒక చెట్టుకి 52 నుంచి 58 కాయలు రావడంతో ఎకరాకు 37బస్తాలు దాకా దిగుబడివచ్చిందని హర్షం వ్యక్తం చేసారు. కెవికె కో-ఆర్టినేటర్ సందర్శించి రైతును అభినందించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సోమ శేఖర్ బాబు, పీరూ సాహెబ్, రైతులు పాల్గొన్నారు.

జడ్జిలకు సన్మానం

ప్రజాశక్తి-నందలూరు : నందలూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు అధ్యక్షతన జడ్జిలను సన్మానించారు. ఇన్‌ఛార్జి జడ్జిగా ఉన్నటువంటి జూనియర్ సివిల్ జడ్జి నందిని ధర్మవరంకు బదిలీ అయ్యారు. ప్రస్తుత ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి భార్గవి ఇద్దరికి బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గొబ్బిళ్ళ సుబ్బరామయ్య, జాయింట్ సెక్రెటరీ నాయనపల్లి అనుదీప్ జయసింహ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ హస్తవరం ఆనంద్ కుమార్, మహిళ రిప్రజెంటేటివ్ మాడపురి నళిని, న్యాయవాదులు సయ్యద్ మహమ్మద్ అలీ, కొప్పాల సుబ్రహ్మణ్యం, పసుపులేటి శ్రీకర్, పనతల రాబిన్సన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు దారి చూపించాలి

- మంత్రి ‘మండిపల్లి’కి శ్రీనివాసపురం గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-గాలివీడు : మండలంలోని శ్రీనివాసపురంలోని శ్మశాన వాటికకు దారి లేదని వెంటనే దారి ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డికి గ్రామ ప్రజలు వినతిపత్రం సమర్పించారు. దారి సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి శ్రీనివాసపురం స్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మంత్రి మండిపల్లితో మాట్లాడుతున్న శ్రీనివాసపురం గ్రామస్తులు

క్రైం కార్నర్

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ సీజ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సీజ్ చేసిన అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మినీ లారీ

అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని పోలీసులు శుక్రవారం సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం రాయచోటి నుంచి వాల్మీకిపురం మీదుగా మదనపల్లి వైపు వెళుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి నాకాబందీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అటువైపు వచ్చిన ఐచర్ వాహనంలో దాదాపు వంద బస్తాల అక్రమ రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఐచర్ వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నందలూరు మండలంలోని ఆడపూరు గ్రామపంచాయతీ పరిధిలోని మర్రిపల్లి పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎఎస్ఐ మోసెస్ తన సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి ఆరు మొబైల్స్, రెండు స్కూటీలు, రూ.15,300లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.